సాక్షి
కాకినాడ

శనివారం | 10 | ఆగస్టు | 2024



సత్యదేవునికి సువర్ణ ధ్వజస్తంభం

సత్యదేవుని ఆలయంలో శుక్రవారం నూతన సువర్ణ ధ్వజ స్తంభాన్ని వేద మంత్రాల నడుమ ప్రారంభించారు.


8లో



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం: సత్యదేవుని ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఈరంకి వేంకటశర్మ (హైదరాబాద్) శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు.

6.81 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 6,81,702 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.40 నీటి మట్టం అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 5,500 క్యూసెక్కులు వదిలారు.

తగ్గని కమిటీ పెద్దోళ్లు!

- దేవాలయాల కమిటీల్లో స్థానాలకు కూటమి నేతల పోటీ
- మీకు నాలుగు, మాకు నాలుగంటూ ప్రతిపాదనలు
- ఇప్పటికే అనధికారికంగా పలుచోట్ల పెత్తనాలు



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అధికారం వచ్చి రెండు నెలలైపోయింది. ఎన్నికల్లో ఎంతో కష్టపడ్డాం. మాకు ఏమిస్తారని కూటమి నాయకులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 198కి పైగా పెద్ద ఆలయాలు, సుమారు 900కి పైగా చిన్న ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాల్లో ట్రస్టుబోర్డు చైర్మన్, సభ్యుల పదవుల కోసం ఇప్పటికే కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్ద ఆలయాల్లో ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిసి 10 మంది, చిన్న ఆలయాల్లో 8 మంది సభ్యులను నియమించుకొనే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం విజయం సాధించిన వెంటనే ఆయా ఆలయాలకు చెందిన సభ్యులు రాజీనామాలు చేశారు. దీంతో కూటమి నాయకులు ఆ పదవుల కోసం పట్టు పడుతున్నారు. ఒక్కొక్క ఆలయంలో 10 నుంచి 8 మందికి మాత్రమే కమిటీ సభ్యులుగా వేసుకొనే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం ఒక్కొక్క ఆలయానికి 40 నుంచి 50 మంది కూటమి నాయకులు పోటీ పడుతున్నారు. దీంతో ప్రతీరోజు ఆశావహుల జాబితా పెరిగిపోవడంతో స్థానిక ఎమ్మెల్యేలు తలలు పట్టుకొంటున్నారు. టీడీపీ నాయకులు పెత్తనం చెలాయిస్తుంటే మా మాటేమిటని జనసేన నాయకులు అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఉంటే కమిటీల్లో తమ పార్టీ సభ్యులకు కూడా అవకాశం కల్పించాలని బీజేపీ నాయకులు దరఖాస్తులు ఇస్తున్నారు. దీంతో ఆలయ కమిటీ నియామకాలు ఎలా చేయాలో పాలుపోని పరిస్థితి ఉంది.

టీడీపీ తీరుతో జనసేన నేతల ఆవేదన

జిల్లా కేంద్రమైన కాకినాడలో బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా టీడీపీ నుంచి గ్రంధి బాబ్జి, జనసేన పార్టీ నుంచి పార్టీ నగర అధ్యక్షుడు తోట సుధీర్ పోటీ పడుతున్నారు. ఇప్పటికే టీడీపీ ఈ దేవాలయంలో చైర్మన్ పదవికి కర్చీఫ్ వేసేసింది. ఇటీవల ఆలయంలో నిర్వహించిన శాకాంబరి అలంకరణ పనులు అన్నీ తానై గ్రంధి బాబ్జి చూడడంతో ఆయననే చైర్మన్‌గా నియమిస్తారని టీడీపీ వర్గాలు అంటున్నాయి. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సైతం ఆలయంలో ఏ కార్యక్రమమైనా గ్రంధి బాబ్జి చూసుకొంటారని అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో జనసేన నాయకులు మరి మా మాటేమిటని ఆవేదన చెందుతున్నారు. పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవి కోసం టీడీపీ, జనసేన నాయకులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ తమ వర్గీయులకు కట్టబెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈసారి చైర్మన్ పదవి తమకు ఇవ్వాలని జనసేన నాయకులు టీడీపీ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, కుంతీమాధవస్వామి దేవస్థానాలకు అటు టీడీపీ, ఇటు జనసేన నాయకులు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు. సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కంటే బాబు ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. జనసేన నాయకులు తమకు



పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం

కావాలని పోటీ పడుతున్నా కంటే బాబు టీడీపీ సీనియర్ నాయకులు కావడం కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అతనికి తప్ప వేరొకరి ఇచ్చే పరిస్థితి లేదని టీడీపీ నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. లోవ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్‌గా గొర్లి అచ్చియ్యనాయుడు దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. గొర్లి అచ్చియ్యనాయుడు వైఎస్సార్‌సీపీలో చైర్మన్ పదవి పొంది టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీలోకి జంప్ అయ్యారు. చైర్మన్ పదవి ఆశచూపి అతనని టీడీపీ నాయకులు ఎర వేశారని బహిరంగంగానే చెబుతున్నారు. ఇక తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి దేవస్థానం, పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానంతోపాటు అన్నవరం సత్యదేవుని ఆలయ కమిటీ సభ్యుల కోసం చాంతాండ జాబితా ఉండడంతో ఆయా పార్టీలకు చెందిన నాయకులు తలలు పట్టుకొంటున్నారు.

నిబంధనలతో మరింత తలపోటు

దేవదాయశాఖ నిబంధనల ప్రకారం ప్రతీ ఆలయానికి నియమించే కమిటీలో 50 శాతం కమిటీ సభ్యులుగా బీసీలను నియమించాలి. ప్రతీ కమిటీలోను 50 శాతం మహిళలకు నియమించాలి. ప్రతీ కమిటీలోను నాయీ బ్రాహ్మణుడు ఉండాలి. కూటమి నేతల్లో అధికంగా పురుషులు కమిటీల్లో స్థానం కోసం పోటీపడుతుండడంతో వాటిని నిబంధనల ప్రకారం ఎలా భర్తీ చేయాలో తెలియక కూటమి ప్రభుత్వం నాయకులు బుర్రలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్న ఆలయాల్లో కమిటీ సభ్యుల కోసం పెద్ద పోటీ లేకున్నా, అన్నవరం, లోవ తలుపులమ్మ, పెద్దాపురం మరిడమ్మ, కాకినాడ బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం, తొలితిరుపతి శృంగార వల్లభస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం వంటి పెద్ద ఆలయాల్లో కమిటీ సభ్యుల కోసం మూడు పార్టీల నుంచి జాబితా పెద్దగానే ఉంది. ఎవరి పేర్లు ఖరారు చేయాలో తెలియక కూటమి ప్రభుత్వం పెద్దలు అయోమయంలో పడ్డారు.

మేమే వస్తాం అంటూ పెత్తనం

ఇప్పటికే కొందరు కూటమి నాయకులు ప్రభుత్వం నుంచి ఎటువంటి నియామక ఉత్తర్వులు లేకున్నా ఆలయాల్లో పెత్తనం మొదలు పెట్టారు. మా ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి మేమే ఇక్కడ సభ్యులం, ఆలయంలో జరిగే కార్యక్రమాలు మాకు తెలియకుండా చేయడానికి వీలు లేదంటూ ఆలయ అధికారులకు కూటమి నేతలు హుకుం జారీ చేస్తున్నారు. టీడీపీ, జనసేన నాయకులు ఆలయంలో జరిగే కార్యక్రమాల్లో దూరిపోతున్నారు. దీంతో అధికారులు వీరి పెత్తనాలకు విసిగెత్తిపోతున్నారు.

న్యూస్‌రీల్

విద్యతోనే అభివృద్ధి

ప్రత్తిపాడు రూరల్: విద్యతోనే గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. మండలంలోని పాండవులపాలెం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండాను ఆవిష్కరించి కొమరం భీమ్, జాతీయ నేతల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆదివాసీలు గిరిజన సాంస్కృతిక, సంప్రదాయ నృత్యాలు, ఇతర ప్రదర్శనలు చేశారు. సబ్ ప్లాన్ ఏరియాను రంపచోడవరం ఐటీడీఏలో చేర్చాలని స్థానిక గిరిజనులు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వినియోగించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి విజయశాంతి, ఎంపీడీఓ ఎస్ డేవిడ్ రాజు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ టి.శ్రీనివారావు, ఎంఈఓ వి రాజబాబు, ఎస్సై ఎం పవన్ కుమార్, సీటీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మీ స్థానిక గిరిజనులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

12న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: ఈ నెల 12వ తేదీ సోమవారం వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హెచ్‌డీఎఫ్‌సీ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సీఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యూయలరీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్ అండ్ సెక్యూరిటీ, రాక్‌మెన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, డిక్సాన్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు లచ్చారావు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ. 20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈనెల 12వ తేదీ సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయానికి ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు.

సినిమా చెట్టుకి కెమికల్ ట్రీట్‌మెంట్

కొవ్వూరు: కుమారదేవంలో గోదావరి ఒడ్డున కూలిపోయిన భారీ వృక్షాన్ని తిరిగి చిగురింపజేసేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రాజమహేంద్రవరానికి చెందిన రోటరీక్లబ్ సౌజన్యంతో కెమికల్ ట్రీట్‌మెంటు విధానంలో పునజ్జీవం పోసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. శుక్రవారం తల్లివేరుని శుభ్రం చేసి దానిపై పలు రకాల రసాయనాలు స్ప్రే చేయించారు. రోటరీక్లబ్ ప్రతినిధి రేఖపల్లి దుర్గాప్రసాద్ వృక్ష శాస్త్ర నిపుణుల పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు. నలభై నుంచి నలభై ఐదు రోజుల్లో మళ్లీ చెట్టు చిగురిస్తుందన్నారు.

విధ్వంసాలకు దిగితే సహించేది లేదు

కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత



పిఠాపురం: విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనాన్ని కొందరు ధ్వంసం చేయడంపై వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎంపీ వంగా గీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురంలో ఆమె శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ అధికాంలోకి వచ్చిన నాటి నుంచి విధ్వంసాలు పెరిగిపోతున్నాయన్నారు. అంబేడ్కర్ స్మృతివనంలో జరిగిన ఘటన అల్లర్లు పరాకాష్టకు చేరాయనడానికి నిదర్శనమన్నారు. రెండు నెలల్లో ఎంతో మంది వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు చేసి పొట్టన పెట్టుకున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్ర భూమి ఉన్నంత వరకు ఉండాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.450 కోట్లతో విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం నిర్మించారన్నారు. ఈ స్మృతివనం సందర్శనకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షతో ఈ స్మృతివనంలో విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. అంబేడ్కర్ స్మృతివనం విధ్వంసానికి నిరసనగా శనివారం పిఠాపురంలో ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు.

కస్టమ్స్ ఏసీగా రామకృష్ణరాజు యాదవ్



కాకినాడ: కస్టమ్స్, పరోక్ష పన్నుల అదనపు కమిషనర్‌గా ఐఆర్ఎస్ అధికారి డి.రామకృష్ణరాజు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కస్టమ్స్ హౌస్‌లో బాధ్యతలు స్వీకరించారు. 2011 ఐఆర్ఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన గుంటూరు కేంద్ర పరోక్ష పన్నుల కమిషనరేట్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనను పలువురు అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది

దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా సుమారు 30 వేల మంది భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. దేవస్థానంలో వివాహాల సీజన్ కూడా ప్రారంభమవడంతో పెద్ద సంఖ్యలో వివాహాలు కూడా జరిగాయి. సుమారు 30 జంటలు గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున వివాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న నవదంపతులు కూడా దేవస్థానానికి విచ్చేసి స్వామివారి వ్రతాలాచరించి దర్శనం చేసుకున్నారు. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సుమారు నాలుగు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం పెట్టారు.



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అంబేడ్కర్ విగ్రహాల తొలగింపునకు కుట్ర

- జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ దళిత నాయకులు
- విజయవాడలో స్మృతి వనం ఘటనకు నిరసన

జగ్గంపేట: విజయవాడలోని స్మృతి వనంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అరాచక శక్తులు చేసిన దుశ్చర్యలకు నిరసనగా జగ్గంపేట ఎస్సీ కాలనీలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నేతలు, దళితులు ఆందోళన చేపట్టారు. వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, గుల్లా ఏడుకొండలు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి జాన్ వెస్లీ ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని టచ్ చేస్తే ఏఒక్క దళితుడు క్షమించడన్నారు. దేశం గర్వించేలా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలోని స్మృతి వనంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తే దానిని తొలగించేందుకు కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి విగ్రహం వద్ద జగన్ పేరు ఉన్న ప్లేట్లు తొలగించి విగ్రహానికి కొంతహాని చేశారన్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందన్నారు. అంబేడ్కర్ విగ్రహాల జోలికి వస్తే దళితుల ఆగ్రహాన్ని చూడవలిసి వస్తుందని హెచ్చరించారు. స్మృతి వనంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కూటమి నాయుకుల అండతోనే అరాచకశక్తులు విధ్వంసం సృష్టించాయని ఆరోపించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు, దళిత నేతలు గుడాల శాంతి ప్రసాద్, బోడ విజయకుమార్, వడ్లపాటి జయబాబు, వీధి శ్రీను, వల్లూరి సత్యానందం, సెబాస్టియన్ రాజు, సాజె నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నేతలు

అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలి

పిఠాపురం: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి విజయవాడలో జరిగిన అవమానానికి నిరసనగా పిఠాపురం మండలం బైపాస్ రోడ్ భీమ్‌నగర్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన దళిత నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఉలవల భూషణం, రోకళ్ల సూరిబాబు, పులుగు బాబురావు, దండి అనిల్, గెద్దం శ్రీను జవహర్ అలీ, సోషల్ మీడియా కన్వీనర్ రమేష్ పవర్, అంబేడ్కర్ యువజన సహవాసం సభ్యులు పాల్గొని ప్రపంచ మేధావిని ఇలా అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు ఎక్కడ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించారు. ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమం చేపడతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, దళిత నాయకులు అన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

ప్రతిభకు ప్రోత్సాహం

- విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసి వారికి ఉపకార వేతనాలను అందిస్తోంది నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకం (ఎన్ఎంఎంఎస్). కేంద్ర మానవ వనరుల శాఖ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పొందేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హత పొందిన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తుంది. ఈ పథకానికి దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు అందించే స్కాలర్‌షిప్ పథకానికి ఏటా ఆదరణ పెరుగుతోంది.

2008–09 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం

పేద విద్యార్థుల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు 2008–09లో ఎన్ఎంఎంఎస్ పథకాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌కు అర్హత పొందేందుకు ప్రవేశ పరీక్షను నవంబర్‌లో నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.ఆరు వేల స్కాలర్‌షిప్‌ను వారి అకౌంట్లలో వేస్తారు.

పరీక్షా విధానమిలా..

- ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్షకు అర్హులు.
- 7వ తరగతిలో మార్కుల ఆధారంగా పరీక్షకు అర్హత కల్పిస్తారు.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఏడవ తరగతిలో 50శాతం, మిగిలిన తరగతుల వారు 55 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. బీసీ, ఓసీ విద్యార్థులు పరీక్ష ఫీజుగా రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంది.
- ఆబ్జెక్టివ్ విధానంలో 150 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది.
- జిల్లా ప్రాతిపదికగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లితండ్రుల ఆదాయం ఏడాదికి రూ. 3.5 లక్షలకు మించి ఉండకూడదు.
- డివిజన్ కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ఈ నెల ఐదో తేదీన నోటిఫికేషన్ జారీ కాగా, రాత పరీక్ష డిసెంబర్ 8న నిర్వహించనున్నారు. సెప్టెంబరు 6 ఆన్‌లైన్ దరఖాస్తుకు తుది గడువు. కాగా పరీక్ష ఫీజు చెల్లింపునకు సెప్టెంబరు 10 చివరి తేదీ. పరీక్ష రుసుమును ఆన్‌లైన్ దరఖాస్తులో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలి. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో లేదా సంబంధిత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంది.
- గతేడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,233 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 9,830 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ ఏడాది దరఖాస్తుదారుల సంఖ్య మరింత పెరుగుతుందని అధికారుల అంచనా.

జిల్లాల వారీగా గతేడాది వచ్చిన దరఖాస్తులు, పరీక్షకు హాజరైన వారి వివరాలు ఇలా..

జిల్లా	దరఖాస్తులు	పరీక్ష రాసినవారు
కాకినాడ	4170	3974
కోనసీమ	3121	3051
తూర్పుగోదావరి	2,942	2,805

అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకునేలా..



ప్రతి పాఠశాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలి. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగేందుకు ఈ పరీక్ష ఉపకరిస్తుంది. గ్రామీణ విద్యార్థులకు చక్కని అవకాశం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

సద్వినియోగం చేసుకోవాలి



ఏటా అధిక సంఖ్యలో విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు అర్హత పొందుతున్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా హెచ్‌ఎంలు ప్రోత్సహించాలి.

– నక్కా సురేష్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, అమలాపురం

తహసీల్దార్లకు పోస్టింగులు

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన తహసీల్దార్లు తిరిగి జిల్లాకు చేరడంతో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ శుక్రవారం తహసీల్దార్లకు మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లోను, కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో తహసీల్దార్లను నియమించారు. కలెక్టరేట్ మేజిస్ట్రీరియల్ సెక్షన్ ఆఫీసర్‌ను, ల్యాండ్ రిఫామ్స్ స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో కార్యాలయం డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి, కేఆర్‌ఆర్‌సీ తహసీల్దార్‌లతో పాటు 17 మంది తహసీల్దార్లను, మరో 6 గురు డిప్యూటీ తహసీల్దార్లను ఫుల్ అడిషినల్ చార్జీ ఇస్తూ తహసీల్దార్లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

తహసీల్దార్	పోస్టింగ్ స్థలం
ఎ.విశ్వనాథశాస్త్రి	కలెక్టరేట్, మేజిస్టిరియల్ సెక్షన్ సూపరింటెండెంట్, కాకినాడ
కె.రఘురామయ్య	కాకినాడ భూసంస్కరణల స్పెషల్ తహసీల్దార్
పి.త్రినాథరావు	డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి, ఆర్డీవో కార్యాలయం, కాకినాడ
వి.అమ్మాజీ	కేఆర్ఆర్‌సీ, తహసీల్దార్, ఆర్డీవో ఆఫీస్ కాకినాడ
వీఎస్‌వీకెవిఆర్ మురార్జీ	తొండంగి
టి.సుభాష్	కోటనందూరు
జీవీఎస్ ప్రసాద్	తుని
జీవీఆర్ రమేష్	జగ్గంపేట
జె.చిరంజీవి	కిర్లంపూడి
ఎం సూర్యప్రభ	ప్రత్తిపాడు
ఎంవీ వెంకటేశ్వరరావు	ఏలేశ్వరం
కేవీ మాధవరావు	రౌతులపూడి
ఎస్ పోతురాజు	శంఖవరం
సీహెచ్ వెంకటలక్ష్మి	పెద్దాపురం
కె చంద్రశేఖరరెడ్డి	సామర్లకోట
ఎస్ఎల్ఎన్ కుమారి	పిఠాపురం
జి చిన్నారావు	యు.కొత్తపల్లి
కెవివిసత్యనారాయణ	గొల్లప్రోలు
వి జితేంద్ర	కాకినాడ అర్బన్
పీవీవీ గోపాలకృష్ణ	కరప
ఎల్ శివకుమార్	కాజులూరు

పూర్తి అదనపు బాధ్యతలతో తహసీల్దార్లుగా నియమితులైనవారు

ఎంవీఎస్ఎస్ఎన్ జగన్నాథం	కోఆర్డినేషన్ సెక్షన్, సూపరింటెండెంట్ కలెక్టరేట్
జీవీ రామ్‌కుమార్	డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి, ఆర్డీవో కార్యాలయం, పెద్దాపురం.
ఎం సూరిబాబు	తాళ్లరేవు
ఆర్ శ్రీనివాస్	గండేపల్లి
ఎస్ సత్యనారాయణ	కాకినాడ రూరల్
పీవీ సీతాపతి	పెదపూడి

క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపినందుకు జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఆరుగురికి రెండురోజులు జైలు శిక్ష, 24 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2పోలీసు స్టేషన్లు, తిమ్మాపురం, టూటౌన్, త్రీ టౌన్, సామర్లకోట, పోర్ట్ పోలీసు స్టేషన్ల పరిధుల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. శుక్రవారం వారిని కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి ఒక్కొక్కరికీ రెండు రోజులు జైలు శిక్ష, 24 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో...

మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఇద్దరికి రెండురోజులు జైలు శిక్ష, 10 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. తాళ్లరేవు మండలం కోరంగి, వన్ టౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలో మద్యం తాగి బైక్‌పై వెళ్తుండగా కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, 10 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనలో మృతి చెందిన నాగయ్య

కాజులూరు: యానం–ద్వారపూడి ప్రధానరహదారిలో కాజులూరు మండలం ఉప్పుమిల్లి శివారు గొప్పిరేవు వంతెన వద్ద ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజానగరం మండలం ముక్కినాడకు చెందిన పలువురు యువకులు పెనుమళ్లలోని ఒక ఫంక్షన్‌కు వచ్చి అక్కడ నుంచి బైక్‌లపై యానాం వెళ్లారు. తిరిగి వస్తుండగా మేకల నాగయ్య (18) గొప్పిరేవు వంతెన మలుపు వద్ద ఎదురుగా వస్తున్న రామచంద్రపురం–యానం ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్, ఏఎస్సై డేవిడ్, రెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

ఖరీఫ్‌కు వాతావరుణం తోడు..

- మెళకువలతో అధిక దిగుబడి
- జిల్లాలో 92,082 హెక్టార్లలో సాగు లక్ష్యం
- 414 ఆర్బీకేల ద్వారా అన్నదాతకు తోడ్పాటు
- ఇప్పటికే 20 వేల హెక్టార్లలో వెదజల్లు సాగు



నాట్లు వేస్తున్న మహిళలు

కాకినాడ సిటీ: వాతావరణం, వర్షాలు అనుకూలంగా ఉండడంతో ఖరీఫ్ ఆశాజనకంగానే సాగుతోంది. సీజన్ కీలక దశకు చేరడంతో అన్నదాతలు చురుగ్గా పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు.



ఎస్.విజయకుమార్, జిల్లా వ్యవసాయ సంచాలకుడు, కాకినాడ

జిల్లాలో 92 వేల హెక్టార్లలో సాగు లక్ష్యంగా యంత్రాంగం పని చేస్తోంది. ఈ ప్రాంత రైతుల అవసరాల మేరకు రాయితీపై 3375 క్వింటాళ్ల విత్తనాలు, 38,265 మెట్రిక్ టన్నుల ఎరువులు ఆర్బీకేల ద్వారా ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం అధికారులు సిద్ధం చేశారు. 414 ఆర్బీకేల ద్వారా సీజన్ కంటే ముందుగానే విత్తనాలు, ఎరువులు అందించారు. దీంతో ఇప్పటికే 20 వేల హెక్టార్లకు పైబడి వెదజల్లే పద్ధతిని రైతులు అనుసరించారు. తాజాగా ఏలేరు నీటితో మెట్ట ప్రాంతాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. దీంతో వెదజల్లిన భూములు మినహాయించి మిగిలిన 65 వేల హెక్టార్లలో ఊడ్పులు చేపట్టారు. ఇది వరకే సిద్ధం చేసుకున్న నారును కట్టలు కడుతున్నారు. పొలాల్లో నాట్లు వేసేందుకు మురుగు దమ్ములు చేపడుతున్నారు. ఈ తరుణంలో అన్నదాతలు సాగులో మెళ

పాడి-పంట

కువలను అవలంబిస్తే మరింత మేలైన దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎస్.విజయకుమార్ చెబుతున్నారు.

పొలాన్ని ఇలా సిద్ధం చేసుకుందాం..

- నాట్లు వేయడానికి 15 రోజులు ముందు పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించి 2, 3 మార్లు మురుగు దమ్ము చేపట్టాలి.
- పొలమంతా సమానంగా ఉండేలా దమ్ములో చెక్క లేక అడ్డతో చదును చేయాలి. రేగడి భూముల్లో నాట్లు వేయడానికి రెండు రోజులు ముందుగా దమ్ము చేపట్టి తర్వాత నాట్లు వేసుకోవడం మేలైన పద్ధతి.

నాట్లు వేసే సమయంలో..

- నారు సేకరించే సమయంలో లేత ఆకుపచ్చగా ఉంటే మేలు. 25 నుంచి 30 రోజుల వయసుగల నారు అయితే మంచి దిగుబడి సాధించవచ్చు.



అన్నదాతలు సిద్ధం చేసుకున్న నారుమడి

- నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారు నాట్లకు ఉపయోగించాలి. ముదురు నారు నాటాల్సి వచ్చినప్పుడు అధికారుల సూచనలు పాటించాలి.
- నాట్లు వేసే సమయంలో భూసారానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు కాలిబాటలు ఉండేలా జాగ్రత్తపడాలి.
- అప్పుడే గాలి, వెలుతురు సమకూరి చీడ, పీడలను, సుడి దోమలను సమర్థవంతంగా అధిగమించవచ్చు.
- బాటలు ఏర్పాటు చేయడంతో ఎరువులు, పురుగుమందులు వేసేందుకు కలుపు తీయించేందుకు ఇవి ఉపయోగపడతాయి.

యాజమాన్య పద్ధతులు ఇలా..

- భూ సారానికి అనుగుణంగా ఉత్పత్తిని పెంచుకునేందుకు రసాయనిక ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులను కూడా సమపాళ్లలో వాడుకుంటే మేలు.
- పశువుల ఎరువులు, కంపోస్టు ఎరువులు, సేంద్రియ, రసాయన ఎరువులు కలిపి వాడితే 20 నుంచి 25 శాతం నత్రజని ఆదా చేయవచ్చు.
- వరి భూముల్లో అపరాలు, జీలుగు, జనుము, పల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైరును కలిపి కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చు. నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ఎరువులను 25 శాతం మేర ఆదా చేయవచ్చు.
- సజీవ ఎరువులైన నీలిపచ్చనారు, ఆకోళ్ల అజోసై, అజోస్పైరిల్లమ్, పోస్ఫో బాక్టీరియా వంటి జీవ ఎరువులను వాడి నత్రజని, భాస్వరం మోతాదులను 20 శాతం వరకు తగ్గించుకోవచ్చు.
- వరి నాట్లు వేసిన తరువాత 7–10 రోజుల వ్యవధిలో మడిలో పలచగా నీరు నిల్వబెట్టి ఎకరాకు 4 కిలోలు నారుపొడిని ఇసుకతో కలిపి మడి అంతా సమానంగా కలిసేలా చల్లకోవడం మేలు.

- వరి వంగడాల రకాలను అనుసరించి కుదుళ్ల సంఖ్యను నాటే సమయంలో నిర్ధారించుకోవాలి. భూసారం అధికంగా ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్లు నాటుకోవాలి.
- ముదురు నారు వాడాల్సి వచ్చినప్పుడు అధికారుల సూచనల మేరకు నత్రజని ఎరువులు వాడుకోవాలి.

ఏమార్చి ఏటీఎం కార్డు కాజేసి సొమ్ము చోరీ

- ఏడు కేసుల్లో నిందితుడైన వ్యక్తి అరెస్టు
- పదేళ్లుగా నకిలీ విలేకరిగా చలామణి

కొవ్వూరు: ఏటీఎం కార్డులు మార్చి సొమ్ములు కాజేస్తున్న కేసులో నిడదవోలు పట్టణం రాయిపేటకి చెందిన నిచ్చెనకోళ్ల శివరామకృష్ణ అనే వ్యక్తిని గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. ఇటీవల ఐ.పంగిడి గ్రామంలో ఆర్.నారాయణరావు అనే విశ్రాంత ఉద్యోగి ఏటీఎంలోకి వెళ్లిన సందర్భంలో సహాయ పడడానికి ప్రయత్నించినట్లు నటించి అతని కార్డుని మార్చేశాడు. ఏటీఎం పిన్ నెంబర్‌ను తెలుసుకుని వేర్వేరు ఏటీఎంల ద్వారా రూ.33,500 నగదు డ్రా చేసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కె.సుధాకర్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడైన శివరామకృష్ణ వృద్ధులను, అమాయకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతూ



చోరీ కేసులో పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు

సొమ్ము కాజేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఇతనిపై విజయవాడ, రాజమహేంద్రవరం, కొవ్వూరులో ఏడు కేసులు ఉన్నాయన్నారు. అతని వద్ద పలు ఏటీఎం కార్డులు, ఒక మోటారు సైకిల్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే విజేత, నేటివార్త, 12 టీవీ పత్రికా సంస్థల పేరుతో ఉన్న ఐడెంటిటీ కార్డులను అతని వద్ద స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. గడిచిన పదేళ్లుగా విలేకరిగా చలామణి అవుతూ నేరాలకు పాల్పడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మామకు తల కొరివి పెట్టిన కోడలు

మామిడికుదురు: కన్న కొడుకు అందుబాటులో లేడు. ఉపాధి కోసం విదేశం వెళ్లి అక్కడ చిక్కుకుపోయిన పరిస్థితి. వచ్చేందుకు అయిదు రోజులు సమయం పడుతుందన్న సమాచారం. ఈ పరిస్థితుల్లో అనారోగ్యంతో చనిపోయిన మామకు కోడలు తల కొరివి పెట్టిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం బి.దొడ్డవరం గ్రామంలో శుక్రవారం జరిగింది. బి.దొడ్డవరం గ్రామానికి చెందిన కేతా బాపూజీ (63) గురువారం అనారోగ్యంతో చనిపోయారు. మస్కట్ దేశంలో ఉన్న కొడుకు శివరామ సుబ్రహ్మణ్యానికి తండ్రి మరణ సమాచారం అందించారు. అతను స్వగ్రామం వచ్చేందుకు ఎంతగా ప్రయత్నించినా వీలు పడలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. అనారోగ్య సమస్యల వల్ల కుమార్తె జోగి శారద, అల్లుడు కుమార్ కృష్ణ తల కొరివి పెట్టే పరిస్థితులు లేవు. దీంతో కోడలు కేతా దుర్గాభవాని మామ బాపూజీకి తల కొరివి పెట్టారు. భుజంపై కుండ పెట్టుకుని చితి చుట్టూ తిరిగి చితికి నిప్పటించారు.



మామకు తల కొరివి పెట్టిన దుర్గాభవాని

మోటారు సైకిల్ దొంగల అరెస్టు

కాకినాడ రూరల్: సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు గురైన సుమారు రూ.7.5 లక్షల విలువైన పది మోటారు సైకిళ్ల దొంగలను అరెస్టు చేసినట్టు సీఐ పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న కాకినాడ డైరీఫారం సెంటర్‌కు చెందిన దమ్ము శివప్రసాద్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గరలోని గుండారపు శివరామ్ సాయిలను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మోటారు సైకిళ్లను కొనుగోలు చేసిన గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన కండిపల్లి తేజ ఈశ్వర్‌ను కూడా అరెస్టు చేశామన్నారు. నిందితులను కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి ఎస్సై అజయ్‌బాబు, ఏఎస్ఐ బలరామ్, హెడ్‌కానిస్టేబుల్ సత్తిబాబు, రాజు, గణేష్‌బాబు, కానిస్టేబుల్ వెంకటరత్నం పనిచేసినట్టు సీఐ తెలిపారు.



చోరీకి గురైన మోటారు సైకిళ్లతో నిందితులు

ఒలింపిక్స్ పతకాలపై డీఎస్ఏ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు పలు క్రీడాంశాల్లో పతకాలు సాధించడంతో డీఎస్ఏ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ డీఎస్ఏ ఆవరణలో శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జావెలిన్‌త్రో, రైఫిల్ షూటింగ్, హాకీలో భారత క్రీడాకారులు పతకాలు కైవసం చేసుకున్న సందర్భంగా క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని తెలిపారు. అనంతరం ర్యాలీ డీఎస్ఏ మైదానం నుంచి నాగమల్లితో జంక్షన్ వరకు, తిరిగి నాగమల్లితోట జంక్షన్ నుంచి డీఎస్ఏకు చేరింది. ఈ ర్యాలీలో డీఎస్ఏ కోచ్‌లు రుద్ర, సురేష్, సతీష్‌కుమార్, నాగేంద్ర, అప్పలనాయుడు, హాకీ కోచ్ రవిరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి ఆత్మహత్య



మృతి చెందిన యువతి పెనుమాకలక్ష్మి

నల్లజర్ల: ఫోన్ ఎక్కువగా మాట్లాడొద్దని మందలించిన తల్లిదండ్రుల మాటలకు మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. నల్లజర్ల మండలం ఘంటావారిగూడేనికి చెందిన పెనుమాక లక్ష్మి(17) ఇంటర్ ప్రైవేటుగా చదువుతూ ఓమందుల షాపులో పనిచేస్తోంది. ఆమె ఎక్కువగా ఫోన్ మాట్లాడుతుండడంతో తల్లిదండ్రులు శ్రీనివాసరావు, సుశీల శుక్రవారం ఉదయం మందలించారు. వారిద్దరు పొలం పనులకు వెళ్లిన సమయంలో వారికి ఫోన్ చేసి మాట్లాడాలి ఇంటికి రమ్మని పిలిచింది. వారు ఇంటికి వచ్చి చూడగా గదిలో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. కాగా ఇది మందలింపు కాదని ప్రేమ వ్యవహారంలో విఫలమై ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు చెబుతున్నారు. హెడ్‌కానిస్టేబుల్ స్టాలిన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై లారీ బోల్తా : డ్రైవర్ మృతి



మృతి చెందిన లారీ డ్రైవర్

దేవరపల్లి: కొచ్చిన్ నుంచి కర్ణాటక వెదురు గడల లోడుతో వెళ్తున్న లారీ శుక్రవారం తెల్లవారు జామున దేవరపల్లి మండలం రామన్నపాలెం వద్ద గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై బోల్తా పడింది. లారీ అదుపుతప్పి రోడ్డుపై డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడినట్టు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపపడి మృతి చెందాడని, వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గండేపల్లి: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందినట్టు హెచ్‌సీ జీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని సుబ్బాయమ్మపేటకు చెందిన బొండా నాగరాజు (48) శుక్రవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటి గోడలు తడిపేందుకు ఇంటి వద్ద బోరు మోటార్ స్విచ్ ఆన్ చేయగా షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు భవాని శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అబుదాబి నుంచి స్వదేశానికి చేరుకున్న మహిళ

కపిలేశ్వరపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకకు చెందిన కాశి జ్యోతి ఎట్టకేలకు అబుదాబి నుంచి భారత దేశానికి చేరుకుంది. పి.గన్నవరానికి చెందిన ఏజెంట్ ద్వారా సుమారు ఆరు నెలల క్రితం అబుదబికి వెళ్లిన ఆమె అక్కడ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, పని ఒత్తిడి బాధిస్తోందని ఎంత చెప్పినా స్పందించడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ సెల్ఫీ వీడియోను ఇటీవల పోస్ట్ చేశారు. భారత దేశ దౌత్యాధికారులు స్పందించి ఆమె రాకకు తగిన కృషి చేశారు. స్వదేశానికి చేరుకున్న జ్యోతిని తీసుకు వచ్చేందుకు కుటుంబ సభ్యులు హైదరాబాద్ వెళ్లినట్టు వీధివారిలంక గ్రామస్తులు తెలిపారు.

నాటు తుపాకీతో కుక్కను చంపిన వ్యక్తి అరెస్టు

అన్నవరం: నాటు తుపాకీతో కుక్కను కాల్చి చంపిన శంఖవరం మండలం వేలంగి గ్రామానికి చెందిన మొండి రాజును పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి నాటు తుపాకీ, గన్ పౌడర్, సీసం గుళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ కె. లలిత కుమారి శుక్రవారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీ రాత్రి వేలంగి గ్రామానికి చెందిన మొండి రాజు అదే గ్రామానికి చెందిన జగన్నాథం శివకు చెందిన కుక్కను నాటు తుపాకీతో కాల్చి చంపాడు. ఎనిమిదో తేదీన శివ ఫిర్యాదు మేరకు అన్నవరం పోలీసులు రాజును అదుపులోకి తీసుకుని విచారించగా ఆ కుక్క తన కోళ్లను చంపి తినేస్తుండడంతో తన అన్న రమణకు చెందిన తుపాకీతో కాల్చి చంపినట్టు తెలిపాడని సీఐ వివరించారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి నాటు తుపాకి, అందులో వాడే గన్‌పౌడర్, సీసం గుళ్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ లతాకుమారి తెలిపారు.

సత్యదేవునికి సువర్ణ ధ్వజ స్తంభం



ధ్వజస్తంభం పూజా కార్యక్రమంలో పాల్గొన్న దాత దంపతులు, ఇన్‌చార్జి ఈఓ రమేష్ బాబు, డీఈ ఉదయ్ తదితరులు



ధ్వజస్తంభంపై సింహవాహనాసీనురాలైన అమ్మవారు



ధ్వజస్తంభం చివరన సుదర్శన చక్రం, మేఖలాలు

- ప్రత్యేక పూజలతో ప్రారంభించిన పండితులు
- రూ.మూడు కోట్ల వ్యయంతో రెండు కిలోల బంగారం తాపడం

అన్నవరం: రత్నగిరిపై మరో అపురూప ఘట్టం ఆవిష్కృతమైంది. సత్యదేవుని ఆలయంలో శ్రావణ శుద్ధ పంచమి శుక్రవారం నూతన సువర్ణ ధ్వజ స్తంభాన్ని వేద మంత్రాల నడుమ ప్రారంభించారు. నెల్లూరుకు చెందిన దాత కుటుంబ సభ్యులు రూ.మూడు కోట్లు వ్యయంతో ఈ స్తంభం ఏర్పాటుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఉదయం తొమ్మిది గంటలకు ప్రత్యేక పూజల అనంతరం 10.20 గంటల సుముహూర్తంలో ధ్వజ స్తంభానికి పండితులు హారతి ఇచ్చారు. దాత దంపతులతో బాటు ఆలయ ఇన్‌చార్జి ఈఓ డీఎల్‌వి రమేష్ బాబు, డీఈఈ ఉదయ్ తదితరులు దానికి ప్రదక్షిణలు చేసి పూజలు ప్రారంభించారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు సుధీర్, దత్తు శర్మ, పరిచారకుడు పవన్, వ్రత పురోహితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

50 ఏళ్ల తరువాత నూతన 'స్వర్ణ' ధ్వజస్తంభం

సుమారు 135 ఏళ్ల ఆలయ చరిత్ర కలిగిన సత్యదేవుని ఆలయంలో 50 ఏళ్ల తరువాత పాత ధ్వజస్తంభం స్థానంలో నూతన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసి స్వర్ణ తాపడం చేశారు. గత ఏడాది మే నెలలో పాత ధ్వజస్తంభ పాడైందని గుర్తించి నూతన స్తంభానికి అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ భావించగా, అదే సమయంలో స్వర్ణ తాపడానికి దాతలు ముందుకు వచ్చారు. ఈ మేరకు గత ఏడాది ఆగస్టులో గుంటూరు జిల్లా తెనాలిలోని టింబర్ డిపో నుంచి కర్రను సేకరించి అక్టోబర్‌లో దేవస్థానానికి తీసుకువచ్చారు. అనంతరం గత ఏప్రిల్ 22న అనివేటి మండపంలో దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్, ధ్వజస్తంభం దాత, పెద్ద సంఖ్యలో భక్తుల సమక్షంలో నూతన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మే నెలలో మండపేటకు చెందిన చిన్నా బృందం సభ్యులు సుమారు 300 కిలోల రాగి రేకులను ధ్వజస్తంభానికి అమర్చి సరిచూసి అనంతరం చెన్నైకు చెందిన స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు బంగారు పూత కోసం దాతలు అప్పగించారు.

- ఇదంతా పూర్తయ్యాక ఈ నెల తొమ్మిదో తేదీన నూతన ధ్వజ స్తంభానికి స్వర్ణ రేకు తాపడం చేయాలని దేవస్థానం అధికారులు నిర్ణయించి చదరపు అడుగు రేకుకు ఐదు గ్రాముల బంగారం చొప్పున రెండు కిలోల 24 క్యారట్ బంగారంతో పూత పూసినట్లు తెలిపారు. కాగా దేవస్థానం అధికారులు అనుమతిస్తే ధ్వజస్తంభం పీఠానికి కూడా స్వర్ణ రేకు తాపడం చేస్తామని దాత తెలిపారు.

ప్రారంభోత్సవంలో పాల్గొనడం అదృష్టం

సత్యదేవుని ధ్వజస్తంభం కర్ర సేకరణకు తెనాలి వెళ్లిన వారిలో నేను కూడా ఉన్నాను. దగ్గరుండి టింబర్ డిపోలో కర్రలను పరిశీలించి కర్రను ఎంపిక చేశాం. ధ్వజస్తంభం ప్రతిష్ఠ, స్వర్ణ రేకు తాపడం అనంతరం ప్రారంభోత్సవంలో ఇన్‌చార్జి ఈఓగా పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను

ఇన్‌చార్జి ఈఓ రమేష్ బాబు